క్లుప్తంగా

ఎమ్మెల్యేకు సన్మానం

నారాయణపేట: నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం చేపట్టేందుకు పాలన అనుమతులు సాధించడంపై మంగళవారం సీవీఆర్ భవన్‌లో ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డిని జిల్లా జలసాధన సమితి, బీకేఎస్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పథకంలో జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో నర్సింహ, వెంకోభ, రంగారెడ్డి, కౌన్సిలర్ సలీం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ జాతర

దామరగిద్ద: మండల కేంద్రంలో ఎల్లమ్మ తల్లి జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు కుంకుమ పసుపుతో ప్రత్యేక పూజలు చేపట్టారు. మద్దెల్‌బీడ్, దామరగిద్ద, బాపన్‌పల్లి తదితర గ్రామాల ప్రజలు అమ్మవారికి బోనాలు సమర్పించారు.

మరికల్: నారాయణపేట మండలం లింగంపల్లిలో మంగళవారం నుంచి ప్రారంభమైన ఎల్లమ్మ జాతరకు మండలంలోని పలు గ్రామాల నుంచి గ్రామస్తులు తరలివెళ్లారు. మండల కేంద్రంతో పాటు ఇతర గ్రామాల నుంచి ఆటోలు, బస్సుల్లో కిక్కిరిసి జాతరకు వెళ్లిన గ్రామస్తులు అక్కడ అమ్మవారికి బోనాలను సమర్పించి సాయంత్రం ఇళ్లకు తిరుగు ప్రయాణమయ్యారు.

ఎండిన వరి పంట



ధన్వాడ: మండలంలోని యంనోనిపల్లి చెందిన రైతు సాయికుమార్ నాలుగు ఎకరాలలో వరి పంట వేశారు. ప్రస్తుత ఎండలకు బోరు ఎండిపోవడంతో నీరు లేక ఎండిపోయిందని రైతు వాపోయాడు. పంట కాపాడుకునేందుకు మరో మూడు బోర్లు వేసినా నీరు రాకపోవడంతో ఇబ్బందుల్లో పడిపోయాడు. పంటను కాపాడుకోలేక బ్యాంకులో తెచ్చిన రుణం కట్టలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని రైతు వాపోయాడు. కోయిల్‌సాగర్ నుంచి యంనోనిపల్లి చెరువుకు నీరు తరలిస్తే ఇలాంటి సమస్యలు ఉండవని తెలిపారు. కలెక్టర్, ఎమ్మెల్యే స్పందించి రైతులకోసం సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



మాగనూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే మార్గంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. రోడ్డు పక్కనే ఉండటంతో పాటు తక్కువ ఎత్తులో ఉండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు, ఆస్పత్రికి వచ్చే ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. ఆస్పత్రికి వచ్చే వాహనాలు సైతం గతంలో అదుపు తప్పి అటువైపు దూసుకెళ్లిన ఘటనలు ఉన్నాయి. అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను కొంత దూరం పెట్టడంతో పాటుగా దిమ్మె ఎత్తు పెంచాలని కోరుతున్నారు.

దేవాలయ భూములను కాపాడాలి

కోస్గి: అభివృద్ధి పనుల పేరుతో ప్రభుత్వం దేవాలయ భూముల స్వాధీనానికి ప్రయత్నిస్తుందని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నర్సింహులు ఆరోపించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలో ఉన్న వేణుగోపాల స్వామి ఆలయానికి సంబంధించిన 18 ఎకరాల భూమిని వివిధ అభివృద్ధి పనుల కోసం తీసుకున్నారని, ఇతర మతాలకు చెందిన భూములు ఉన్నప్పటికి వాటిని తీసుకోవడం లేదన్నారు. ఇదే విషయమై బీజేపీ మేధావుల ఫోరం జిల్లా కన్వీనర్ బాల్‌నర్సయ్య, బద్రీనాథ్ విమర్శించారు. కార్యక్రమంలో రాము, వెంకటేష్, శ్రీకాంత్, బస్వరాజ్, సంపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిరండి: ఎమ్మెల్యే

నారాయణపేట: కోస్గిలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి సభకు జిల్లాలోని రైతులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి మంగళవారం ప్రకటనలో కోరారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు కోస్గి పట్టణంలో సీఎం పలు అభివృద్ధి పనులతో పాటు పేట కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తికి స్వల్ప గాయాలు

దామరగిద్ద: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి స్వల్ప గాయాలైన ఘటన మంగళవారం ఎల్లమ్మ జాతర ఉత్సవాల్లో చోటు చేసుకుంది. మండలంలోని బాపన్‌పల్లికి చెందిన మల్లప్ప అనే వ్యక్తి ఎల్లమ్మ ఆలయ సమీపంలోని కల్వర్టు పక్కన ద్విచక్రవాహనంపై అదుపు తప్పి కాల్వలో పడింది. కాగా మల్లప్ప పక్కకు దొర్లడంతో స్వల్ప గాయాలయ్యాయి. ఉత్సవాల్లో స్థానిక పోలీసులు ఎలాంటి భద్రత చర్యలు తీసుకోకపోవడం, ఇరుకు దహదారిపై ట్రాఫిక్ సమస్యను అదుపు చేయకపోవడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

ప్రధాని.. రైతు పక్షపాతి



ఊట్కూర్‌లో రైతులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

కృష్ణా/ఊట్కూర్: ప్రధాని మోదీ రైతు పక్షపాతి అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన రైతులతో ముఖాముఖి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. నియోజకవర్గంలోని ఊట్కూరు, మక్తల్, మాగనూర్, కృష్ణా తదితర ప్రాంతాల్లో జింకల బెడద అధికంగా ఉండటంతో రైతులు తీవ్రంగా పంట నష్టపోతున్నారని రైతులు దొబ్బలి హన్మంతు, రామప్ప, సోప్ప నర్సిరెడ్డి తదితరులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వేలాది జింకలు గుంపులు, గుంపులుగా వచ్చి పంటను మేస్తున్నాయని ప్రజాప్రతినిధులు, అటవీశాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని, అవసరమైతే రైతులను ఢిల్లీకి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని పలువురు రైతులు కోరగా ఇప్పటికే చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు రూ.2,450 ధర ఉన్న యూరియా బస్తాను రాయితీపై రూ.300కు అందిస్తున్నామని చెప్పారు.

రైళ్లను పునరుద్ధరించండి

కృష్ణా రైల్వే స్టేషన్‌లో కరోన కంటే ముందు నిలిచే రైళ్లను పునరుద్ధరించాలని అఖిలపక్ష నాయకులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. మాజీ సర్పంచ్ మహదేవ్ మాట్లాడుతూ కృష్ణా రైల్వేస్టేషన్ జిల్లాలోనే అతి పురాతన స్టేషన్ అని, ప్రయాణికులు ఇక్కడి నుంచి ముంబాయి, బెంగళూర్, చెన్నై తదితర పట్టణాలను ప్రతి రోజు వెళ్తుంటారని తెలిపారు. గతంలో ఇక్కడ ప్రతి ఎక్స్‌ప్రెస్ రైలు నిలిపేవారని, ఇప్పుడు నిలపకపోవడంతో ఈ ప్రాంత ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని వివరించారు. ఆయన సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు లేదు

విజయ సంకల్పయాత్రను బీజేపీలోని ఓ వర్గం దూరంగా ఉండడంతో మండలానికి చెందిన సీనియర్ నాయకుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మేము చిన్నప్పటి నుంచి ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, బజరంగదళ్‌లో పని చేశామని, పార్టీ అభివృద్ధి కోసం ఎంతో కష్టపడిన ఫలితం లేదని ఆ నాయకుడు విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో కూడా ఇదే మాదిరిగా వ్యవహరించారని, ఇప్పుడు ఈ యాత్ర విషయంలో కూడా అదే జరుగుతుందన్నారు. ఏది ఏమైనా పార్టీ కోసం పని చేసే నాయకులకు విలువ లేదన్నారు. ఈ విజయ సంకల్పయాత్రలో ప్రజలు భాగస్వాములు కాకపోవడం, నాయకులు ఆ విధంగా కృషి చేయకపోవడం తమకు చాలా బాధగా ఉందన్నారు.

తొలిరోజు యాత్ర సాగిందిలా..

- కిషన్‌రెడ్డి 11 గంటలకు చేరుకోని దత్తాతేయ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం కృష్ణానది దగ్గర ఉన్న కృష్ణమ్మ విగ్రహానికి పూజలు చేశారు. విజయ సంకల్ప్ యాత్రను ప్రారంభించి శంఖం పూరించారు.
- మధ్యాహ్నం 12 గంటలకు కృష్ణ నుంచి హిందుపూర్ మీదుగా టైరోడ్డుకు చేరుకున్నారు. అక్కడి నుంచి గుడేబల్లూర్ మీదుగా మాగనూర్.. ఆ తర్వాత యాత్ర మక్తల్‌కు చేరుకుంది.
- 1.40 గంటలకు మక్తల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. 2 గంటలకు మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో నేతలు మాట్లాడారు. 3.20 గంటలకు మక్తల్ నుంచి ఊట్కూర్ చేరుకున్నారు.
- అయ్యప్ప ఆలయం దగ్గర సాయంత్రం 4 గంటలకు భోజనం చేసి అనంతరం ఆలయ ప్రాంగణంలో రైతులతో ముఖాముఖిలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. జింకల సమస్యల అధికంగా ఉందని రైతులు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.
- 4.40 గంటలకు ఊట్కూర్ నుంచి ఓబ్లాపూర్, తిప్రాస్‌పల్లి మీదుగా నారాయణపేట మండలం సింగారం క్రాస్ గుండా 5.30 గంటలకు నారాయణపేటకు చేరుకున్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి



మక్తల్‌లో డిగ్రీ కళాశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం మక్తల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మక్తల్‌లో డిగ్రీ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వచ్చేదన్నారు. కొందరు మధ్యలోనే చదువు మానేశారన్నారు. నియోజకవర్గ విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులో ఉంచేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం కళాశాల అధ్యాపకులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమలలో ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీచారి, నూరుద్దీన్, రవికుమార్, గణేష్ కుమార్, మూర్తి, రవికుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

- మక్తల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చేతుల మీదుగా అంగన్‌వాడీ టీచర్లకు అందజేశారు. మొత్తం 14 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసినట్లు తెలిపారు. మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, సీడీపీఓ సరోజిని, విష్ణువర్ధన్‌రెడ్డి, సురేష్, అడ్వకేట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.
- కులవృత్తిదారులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ మండల కార్పెంటర్ల సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, విశ్వనాథ్, వెంకటేష్, శ్రీకాంత్‌కుమార్, మానేష్, రాజు, సర్పరాజ్, మనోహర్, బాల్‌రాజు, శ్రీనివాసాచారి, బ్రహ్మయ్య, విశ్వనాథ్ పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

మరికల్: మండలంలోని వెంకటాపూర్‌లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మంగళవారం రాత్రి ప్రారంభించారు. గ్రామ చౌరస్తాలో ఏర్పాటు చేసిన వీటిని ఎమ్మెల్యే, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి ఆర్థికసాయంతో ఏర్పాటు చేసినట్లు మాజీ సర్పంచ్ కళావతమ్మ తెలిపారు.

పాటల పోటీలో ప్రథమ బహుమతి



నారాయణపేట రూరల్: పాలమూర్ కళావేదిక ఆధ్వర్యంలో ఘంటసాల 50వ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన రాష్ట్రస్థాయి పాటల పోటీలో పట్టణానికి చెందిన గాయిని చక్కటి ప్రతిభ చూపింది. పట్టణంలోని బహార్‌పేట వీధికి చెందిన స్వాతి రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి సాధించింది. అదేవిధంగా మరో గాయిని అపర్ణ ప్రోత్సహక బహుమతిని అందుకుంది. ఈ సందర్భంగా మంగళవారం వారిని మహిపాల్‌రెడ్డి, వసంత్, రామకృష్ణ, సంఘ నర్సింహులు ప్రత్యేకంగా అభినందించారు.

లింగంపల్లి.. జన సంద్రం

- బోనాలతో భక్తుల ప్రదక్షిణ
- నైవేద్యంగా కల్లు, మేకలు, కోళ్లు సమర్పణ



ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మతల్లి



జనసంద్రంగా మారిన లింగంపల్లి ఎల్లమ్మ ఆలయం

నారాయణపేట రూరల్: గ్రామీణ ప్రజల ఆరాధ్యదైవమైన ఎల్లమ్మతల్లి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోనే అత్యంత ప్రత్యేక కలిగిన లింగంపల్లి మంగళవారం జనసంద్రంగా మారింది. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉమ్మడి జిల్లాతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి వలసజీవులు తరలివచ్చారు. ఈ ఉత్సవాలు నాలుగు వారాల పాటు కొనసాగనున్నాయి.

సాయమ్మ నోటికి తాళం..

ఉత్సవాల్లో మొదటి రోజు సాయమ్మ నోటికి తాళం వేయడమే ప్రధాన ఘట్టం. ఈసారి కొంత ఆలస్యంగా ఈ తంతు జరిగింది. మధ్యాహ్నం 1:30గంటలకు అమ్మవారి భక్తురాలు సాయమ్మను మేళతాళాలు, బోనం కుండలతో వైభవంగా ఊరేగిస్తూ ఆలయానికి తీసుకుని వచ్చారు. సాయమ్మ శరీరానికి పుట్టం వేపాకును చుట్టి, ముఖానికి కుంకుమ, పసుపుతో అలంకరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె పూనకంతో ఊగిపోయింది. బైండ్లోళ్లు గవ్వలదండ వేసి ఆమె నోటికి రాగి చువ్వతో తాళం వేశారు. అనంతరం పెద్ద బోనంకుండతో కలిసి అమ్మవారి ఆలయం చుట్టూ రెండు సార్లు ప్రదక్షిణ చేసి పరశురాముని సన్నిధికి తీసుకుని వెళ్లి తాళం తీశారు.



సాయమ్మ నోటికి తాళం వేసి ఆలయంలోకి తీసుకెళ్తున్న మ్యాతర్లు

బోనాలతో భక్తులు..

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో కొత్త కుండలో ఉడకపెట్టిన అన్నం, వంకాయ, ఉలిగడ్డ కూరలతో నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు. కోడి, మేక, గొర్రెలను బలిచ్చి, కల్లును ప్రసాదంగా సేవించారు. అంతకుముందు ఆలయం బయటి నుంచి పోలీసులు వరుస క్రమంలో భక్తులను దర్శనానికి పంపించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, వివిధ పార్టీల నాయకులు దర్శించుకున్నారు. జాతర సందర్భంగా ఆడపిల్లలను జోగినీలుగా మార్చకుండా శిబిరం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. మూఢ నమ్మకాలు, బాల్యవివాహాల నిర్మూలన, ఇతర చట్ట విరుద్ధ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కోటకొండ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జాతరలో భక్తుల రద్దీ విపరీతంగా ఉండటంతో జేబుదొంగలు తమ పని కానిచ్చారు. దాదాపు 8.5తులాల బంగారం, ఇద్దరి పర్సులు ఎత్తుకెళ్లినట్లు తెలిసింది.





అమ్మవారికి నైవేద్యం సిద్ధం చేస్తున్న భక్తులు



బోనాలతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణ

'భారత్‌మాల బాధితులను ఆదుకోండి'



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

- ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్న భూ బాధితులు

నారాయణపేట: భారత్‌మాల బాధితులకు బహిరంగ మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించేలా చొరవ తీసుకోవాలని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే పర్ణికారెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కొండన్న మాట్లాడుతూ.. బాధితుల తరపున జిల్లా న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలిపారు. ఐదారు సంవత్సరాలను నుంచి పేద రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ అటు భూ సేకరణ చేయకుండా ఇటు పరిహార డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం తమ భూముల్లో ప్లాట్లలో భూసేకరణ చేపట్టి ఈ నాటికి పరిహారం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూసేకరణ చేసిన అధికారులు, ప్రభుత్వమూ.. ధరణి వెబ్‌సైట్‌లో అమ్మకాలు కొనుగోలు నిషేధం విధించిందని ఫలితంగా చిన్న, సన్నకారు రైతులుగా ఉన్న పేదలు తమ అవసరాల కోసం అమ్మలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బహిరంగ మార్కెట్లోనే జిల్లాలోని మక్తల్, మరికల్, మాగనూర్ టైరోడ్ చెక్‌పోస్టు పరిసర ప్రాంతాలలో ఎకరాకు రూ.కోటి ధర పలుకుతుందన్నారు. విలువైన భూములు జాతి అవసరాలకై రైతులు తమ భూములు, ప్లాట్లను ఇవ్వడానికి సిద్ధపడితే ప్రభుత్వాలు నష్టపరిహారం ఇవ్వడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లాలోని ఎమ్మెల్యేల చొరవ తీసుకొని జిల్లా పరిధిలో 56 కిలో మీటర్ల మేర ఏర్పాటు చేస్తామని చెబుతున్న భారత్‌మాల జాతీయ రహదారి సుమారు 5వేల మంది బాధితులకు వేగవంతంగా నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో రామలింగం, ప్రసాద్, బుక్క భక్తావర్, నర్సయ్య తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో గురుకుల విద్యార్థి ప్రతిభ

నారాయణపేట రూరల్: ఈనెల 16నుంచి 18వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రంలో నిర్వహించిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో నారాయణపేట మహాత్మా జ్యోతీబాపూలే గురుకుల విద్యార్థి బసంత్ ప్రతిభ చాటి కాంస్య పతకం సాధించాడు. ఈసందర్భంగా మంగళవారం స్థానిక సీవీఆర్ భవన్‌లో క్రీడాకారుడిని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి శాలువాతో సన్మానించి అభినందించారు. అండర్–14 విభాగం ట్రయాథ్లాన్ 60 మీటర్ల లాంగ్‌జంప్‌లో గురుకుల విద్యార్థి మూడో స్థానంలో నిలిచి, కాంస్య పతకం సాధించడం అభినందనీయమన్నారు. క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి రమణ, ప్రిన్సిపాల్ రాములు, కోచ్ జగదీష్, భరత్ పాల్గొన్నారు.

ఘనంగా కర్రెమ్మ తల్లి ఉత్సవం

మాగనూర్: మండలంలోని వర్కూర్‌లో కర్రెమ్మ తల్లి గ్రామ దేవత ఉత్సవం మంగళవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం కూడా ఫిబ్రవరి నెలలో గ్రామస్తులు మొత్తం కలిసి అమ్మవారి ఉత్సవాలు నిర్వహించడం ఇక్కడ పురాతనం నుంచి వస్తున్న ఆచారమని గ్రామపెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి పొట్టేళ్ల, కోళ్లను కోసి మొక్కులు చెల్లించుకున్నారు.



కర్రెమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

పదో తరగతి అంతర్గత మార్కుల పరిశీలన



కోస్గిలో అంతర్గత మార్కులను తనిఖీ చేస్తున్న బృందం

కోస్గి: పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించిన అంతర్గత మార్కులను జిల్లా విద్యాశాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు పరిశీలిస్తున్నాయి. మంగళవారం మండలంలోని ముశ్రీఫా జెడ్పీ ఉన్నత పాఠశాలలో జీహెచ్‌ఎం శంకర్ నాయక్ ఆధ్వర్యంలో బృందం విద్యార్థులు పొందిన మార్కులను తనిఖీ చేసింది. పాఠశాల హెచ్‌ఎం బాలకృష్ణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్: పట్టణంతో పాటు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ఆ పాఠశాలలో నిర్వహించిన నాలుగు ఎఫ్ఏ పరీక్షలు, ప్రాజెక్టుతో కలిపి నాలుగు ఇతర అంశాలకు సంబంధించిన కేటాయించిన 120మార్కులను సరిచూసే ప్రక్రియ మంగళవారం కొనసాగింది. అబ్జర్వర్లుగా నియమించిన నాలుగు బృందాలు 8 పాఠశాలలను పరిశీలించారు. విద్యాశాఖ ఏర్పాటు చేసిన సీసీఈ విధానంలో భాగంగా టెన్త్ విద్యార్థులకు పాఠశాలలో నిర్వహించే కృత్యాలకు సంబంధిత సబ్జెక్ట్ టీచర్లు వేసిన ఇంటర్నల్ మార్కులను సరిచూశారు.

శిక్షణకు వెళ్లిన 79 మంది పోలీసులు



శిక్షణలో ఐడీకార్డులు అందుకుంటున్న పోలీసులు

నారాయణపేట రూరల్: రాష్ట్ర పోలీసు నియామక మండలి ద్వారా జిల్లా నుంచి ఎంపికైన 79మంది పోలీసులు మంగళవారం ప్రత్యేక బస్సులో శిక్షణకు బయలుదేరారు. 9నెలల పాటు సివిల్, ఏఆర్ విభాగల సిబ్బంది వెళ్లగా, వారిలో 60 మంది పురుషులు, 19మంది మహిళలు ఉన్నారు. వారికి అవసరమైన ఐడెంటీ కార్డులు, కిట్, ఆర్టికల్స్ హెడ్‌క్వార్టర్స్‌లో అందజేశారు. అంతకుముందు ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ.. పోలీసుశాఖలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ కలిగి ఉండాలని, క్షేత్రస్థాయిలో అన్ని పరిస్థితుల్లో డ్యూటీలు చేయగలిగే సత్తా సాధించాలన్నారు. శిక్షణ కాలంలో చెప్పిన అన్ని విషయాలను శ్రద్ధగా నేర్చుకోవాలన్నారు.

బహిరంగ ప్రకటన

... Kosgi Mandal ... Antharapu Santhosh S/o Antharapu Yellappa, aged 21 years, Occ: agriculture R/o H.No. 1-102, Polepally village, Kosgi Mandal, Narayanpet Dist. Property ...

... Other than non agriculture land total extent Ac 0-02 gts., (242 sq yards), in Sy.No. 786/AA/1/1/1/2 situated within the limits Polepally Village of Kosgi Mandal, Narayanpet Dist. ... East : Hotel of Antharam Yellappa (donor), West : kaluva, North : Remaining land of donor, South : Road

Sd/- K. CHANDRA MOULI
Panel Advocate & Legal Advisor
Mahabubnagar, Cell : 9440330760

రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక

నారాయణపేట రూరల్: అండర్–14, 16 బాలబాలికల, అండర్–18, 20 మహిళా, పురుషుల విభాగాల్లో 400 మీటర్ల ఛాంపియన్‌షిప్‌కు ఈనెల 22న స్థానిక మినీ స్టేడియంలో జిల్లా స్థాయి క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన క్రీడాకారులు గురువారం ఉదయం 9గంటలకు బోనఫైడ్, ఆధార్‌తో హాజరు కావాలని సూచించారు. చక్కటి ప్రతిభ కనబరిచిన వారిని 25న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

వేరుశనగ @ రూ.7,009

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం వేరుశనగ క్వింటాకు గరిష్ఠంగా రూ.7,009, కనిష్ఠంగా రూ.4,681 ధరలు పలికాయి. జొన్నలు రూ.4,651, తెల్ల కందులు రూ.10,700, శనగలు రూ.6,550 ధరలు వచ్చాయి.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99516 02829

మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557

నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785

వనపర్తి జిల్లా: 95539 55603

జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603

నారాయణపేట జిల్లా: 90109 62007

Office mail : advtmbnr@gmail.com